సామ్రాట్ రిటైల్ డీలర్స్ ఫుడ్ స్టఫ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విశ్వనాథ్

అఫ్జల్‌గంజ్: ఉస్మాన్‌గంజ్ సామ్రాట్ రిటైల్ డీలర్స్ ఫుడ్ స్టఫ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.విశ్వనాథ్ ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికల్లో అల్లం, వెల్లుల్లి, ఎండుమిర్చి వ్యాపారులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సంఘం మాజీ అధ్యక్షుడు బైండ్ల శివకుమార్ ఆధ్వర్యంలో వ్యాపారులు కొత్త అధ్యక్షుడిని సన్మానించి అభినందనలు తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వానం



అబిడ్స్: ఈ నెల 30న యాదవ అహీర్ జమాజ్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే సామూహిక వివాహాల్లో పాల్గొనాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మంత్రి శ్రీధర్‌బాబుకు ఆయన ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా ఈ నెల 30న యాదవ సమాజానికి చెందిన పలువురు జంటలకు ఉచితంగా వివాహాలు జరిపించి వారికి అన్నివిధాల సహకారం అందిస్తున్నట్లు వివరించారు. మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించి సామూహిక వివాహాలకు వచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ విశ్వేశ్వర్‌నగర్‌లోని భద్రాద్రి సీతారామచంద్ర స్వామి ఆలయ 8వ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్, నాయకులు శ్రీధర్‌సాగర్, యాదగిరి నేత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కౌసర్


గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. గురువారం టోలిచౌకీలోని తన కార్యాలయం లో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీ తన ఆవిర్భావం నాటి నుంచే అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలీముద్దీన్, రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

ఉద్యోగులకు అండగా బీఎంఎస్ యూనియన్



అబిడ్స్: ఉద్యోగులకు అండగా బీఎంఎస్ ఎల్లవేళల ఉంటుందని భారతీయ మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, జీహెచ్‌ఎంసీ బీఎంఎస్ అధ్యక్షుడు టి.కృష్ణ పేర్కొన్నారు. గతంలో ఇతర యూనియన్‌కు వెళ్లి ఈరోజు సొంతగూటికి చేరిన గడ్డం శంకర్, సూర్యకుమార్, ముఖేష్‌కు వారు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ..భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం ఉద్యోగ శ్రేయస్సుకు పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. రూపేష్, రాధాకృష్ణ, భిక్షపతి, పవన్ కుమార్, ఆర్.వెంకటేష్, రసూల్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ అదనపు సభ్యుల ప్రమాణ స్వీకారం



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని స్వయంభు లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ పాలక మండలిలో అదనంగా ఇద్దరు సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఈఓ శివ రుద్రప్పల పర్యవేక్షణలో సభ్యులుగా కె.బబిత, పి.మల్లికార్జున్ గౌడ్ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా వారు రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, అసిస్టెంట్ కమిషనర్ శేఖర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు జుర్కీ రాజేందర్, మాజీ చైర్మన్లు జె.సంతోష రాణి, అనిల్ కుమార్, మాజీ సభ్యులు పి.శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్, నాగరాజు, ప్రభాకర్ రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీలు.. దిష్టిబొమ్మల దహనాలు

పహల్గాం ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు



ఉప్పుగూడలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం గుడిమల్కాపూర్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. గుడిమల్కాపూర్ బీజేపీ అధ్యక్షుడు తాళ్ల రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి వివేకానంద స్వామి విగ్రహం వరకు ఈ క్యాండిల్ ర్యాలీ జరిగింది. ఠాకూర్ యోగ్‌రాజ్‌సింగ్, సునీల్‌యాదవ్, ముఖేష్‌సాగర్, రామకృష్ణచారి, మామిడి వెంకటేష్, అక్షయ్‌సింగ్, శంకర్‌ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, జొన్నకంటి మధుసుధన్, పవన్ తదితరులున్నారు.

ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం..

చార్మినార్: పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్ వెల్లడించారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ గుల్జార్‌హౌస్ నుంచి చార్మినార్ వరకు కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన నిర్వహించారు. కార్పొరేటర్ వైకుంఠం, బీజేపీ నాయకులు కే.సురేందర్, నరేందర్, బల్వీర్ సింగ్, కునాల్ రావు, వెంకటేష్‌గౌడ్, పారసాని వెంకటేష్ పాల్గొన్నారు.

పాకిస్తాన్‌కు భారత్ తగిన గుణపాఠం చెబుతుంది..

అఫ్జల్‌గంజ్: పాకిస్తాన్‌కు భారత్ త్వరలోనే తగిన బుద్ధి చెబుతుందని గ్రేటర్ హైదరాబాద్ రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) సీనియర్ నాయకుడు ఆనంద్ మరిపల్లి పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాలుగా పాకిస్తాన్ ఉగ్రవాదులకు అడ్డగా మారిందన్నారు.



పురానాపూల్ చౌరస్తాలో..

గోషామహల్‌లో..

అబిడ్స్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గోషామహల్‌లో బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ గోషామహల్ బీజేపీ నేత ఆల పురుషోత్తమ్‌రావు, కార్పొరేటర్ లాల్‌సింగ్, కన్వీనర్ కృష్ణ, అధ్యక్షుడు సోమరాజ్ సింగ్, చీలంపల్లి సురేష్, రాజ జోహరి, గుణవర్ధన్, సుధీర్‌సింగ్, గోరక్షక్ రాము, రమేష్‌లు ఉగ్రవాదుల పోస్టర్లను నేలపై వేసి నిరసన తెలిపారు.

పురానాపూల్‌లో..

జియాగూడ: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా పురానాపూల్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహన చేశారు. బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు తైలం సందీప్‌సాగర్ ఆధ్వర్యంలో కార్వాన్, జియాగూడ బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. డివిజన్ అధ్యక్షుడు జగదీష్ యాదవ్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ శివకుమార్ యాదవ్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి జె.శ్రవణ్‌కుమార్, కార్యదర్శి హరీష్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, రాజేందర్ డెగాన్, భాస్కర్, రామ్ పాల్గొన్నారు.

గౌలిపురాలో..

గౌలిపురా: ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గౌలిపురా పటేల్‌నగర్‌లోని జీహెచ్‌ఎంసీ ప్లే గ్రౌండ్ నుంచి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పటేల్‌నగర్ డి.శ్రీనివాస్, అడ్వొకేట్ వేణు తదితరులు పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్టలో..

చాంద్రాయణగుట్ట: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బోయ నగేష్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ఘటనలో అసువులు బాసిన మృతులకు ఆత్మశాంతి కలగాలని ప్రార్థించారు. ప్రమోద్ రెడ్డి, శ్యాంరావు ముదిరాజ్, ద్వారక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ ఆధ్వర్యంలో ఉప్పుగూడలో గురువారం రాత్రి ఉగ్రవాద సంస్థ దిష్టిబొమ్మను దహనం చేశారు. కొడీ మహేందర్, తాడెం శ్రీనివాసారావు, మామిడికృష్ణ, మధుసూదన్, విజయ్‌కుమార్, పొన్న శ్రీనివాసారావు, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉగ్ర దాడి పిరికిపంద చర్య..

యాకుత్‌పురా: పహల్గాంలో పర్యటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. అమయకులైన సామాన్య పౌరులను టార్గెట్ చేసుకొని ముష్కరులు దాడి చేయడం పిరికిపంద చర్య అన్నారు.

పహల్గాం బాధితులకు మద్దతుగా క్యాండిల్ ర్యాలీ ..

నాంపల్లి: పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ, ఈ ఘటనలో మృతుల ఆత్మకు శాంతిని ఆకాంక్షిస్తూ నాంపల్లిలో క్యాండిల్ ర్యాలీని చేపట్టారు. నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున స్థానికులు హాజరయ్యారు. ఈ ర్యాలీ మాసబ్‌ట్యాంక్‌లోని హాకీ గ్రౌండ్ నుంచి హనుమాన్ టెంపుల్, బడేమసీద్ మీదుగా నోబుల్ టాకీస్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ ర్యాలీకి మద్దతుగా ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు సంఘీభావం పలికారు. విజేంద్రనాథ్, కైలాష్ సింగ్ (ప్రకాష్), జైద్ ఫరీద్, ఉదయ్ సింగ్, రామ్ దేశాయ్, అబ్దుల్ అజ్మన్, డాక్టర్ మోసీన్, ఖదీర్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఆల పురుషోత్తమ్ రావు, లాల్‌సింగ్, కృష్ణ



పటేల్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ



గుడిమల్కాపూర్‌లో.. క్యాండిల్ ర్యాలీలో బీజేపీ నాయకులు



శాంతి ప్రదర్శనలో ఉమా మహేందర్..



క్యాండిల్ ర్యాలీలో నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్

బీజేఆర్ బాలికల జూనియర్ కళాశాలకు కొత్త అధ్యాపకులు



కొత్తగా వచ్చిన అధ్యాపకులతో కళాశాల ప్రిన్సిపాల్ మాధవి

గోల్కొండ: కళాశాలలో అధ్యాపకుల కొరత పూర్తిగా తీరిందని రాబోయే సంవత్సరంలో ఇంటర్‌లో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తామని గోల్కొండలోని బీజేఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన నలుగురు అధ్యాపకులు గురువారం కళాశాలలో రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతియేటా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఫలితాలు మెరుగవుతూ వస్తున్నాయన్నారు. నలుగురు కొత్త అధ్యాపకులు చేరడంతో వందశాతం ఫలితాలు సాధించేందుకు కలిసిమెలిసి ముందుకు సాగుతామన్నారు. ఈ సందర్భంగా కొత్తగా చేరిన సమీనా ఫర్హాన్, ముబీనా, రజనీ, జహనారా బేగం తదితరులను ఘనంగా సన్మానించారు.

భాషా సంస్కృతుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పురస్కార గ్రహీతలతో శాసన మండలి చైర్మన్ గుప్తా సుఖేందర్ రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: భాషా సంస్కృతులను పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్, ఆదర్శ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సినీ నేపథ్య గాయని ఎస్.జానకి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.జానకి సినీ హిట్స్ పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. అదేవిధంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్నటువంటి పలువురికి ఉగాది విశిష్ట పురస్కారాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్ గుప్తా, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని, ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమ భోగరాజు పాల్గొన్నారు.

డీహెచ్‌ఎల్‌తో గో గ్రీన్ ప్లస్ ఎంఓయూ



ఎంఓయూ పత్రాలను చూపుతున్న సుబ్రహ్మణ్యం, శివరామకృష్ణన్

గన్‌ఫౌండ్రీ: డీహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ గ్లోబల్ కాంట్రాక్టర్ రిసెర్చ్ డెవలప్‌మెంట్ మ్యానిఫ్యాక్చరింగ్ ఆర్గనైజరైన సాయి లైఫ్ సైన్సెస్‌తో ఏ మిషన్‌-లేని షిపింగ్ సొల్యూషన్ -గో గ్రీన్ ప్లస్ ఉపయోగించుకోవడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు గురువారం ఇరు కంపెనీల ప్రతినిధులు ఒప్పందచేసుకున్నారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఎస్ ఎక్స్‌ప్రెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.సుబ్రహ్మణం మాట్లాడుతూ..ఈ ఒప్పందం అంతర్జాతీయ లాజిస్టిక్ అవసరాల కోసం 90శాతం వరకు గ్రీన్ హౌస్ వాయుఉద్గారాలను తగ్గిస్తుందని తెలిపారు. సాయిలైఫ్ సెన్సెస్ 300లకు పైగా గ్లోబల్ ఇన్నోవేటర్ ఫార్మా, బయోటెక్ కంపెనీలతో కలిసి ఔషధ ఆవిష్కరణ, అభివృద్ధి వాణిజ్యాకరణ వేగవంతం చేయడానికి పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో సాయిలైఫ్ సెన్సెస్ సీఎఫ్‌ఓ శివరామకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎగ్జిబిషన్లు ఆలోచనా శక్తిని పెంచుతాయి'



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

లంగర్‌హౌస్: ఎగ్జిబిషన్లు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు ఆలోచన శక్తిని పెంచుతాయని ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. రాబ్సన్ ఆధ్వర్యంలో లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఎగ్జిబిషన్లు నిర్వహించే ఇన్‌ఫాంట్ హ్యాండ్‌లూమ్ హ్యాండిక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ వారు ఈ సంవత్సరం లండన్ సిటీ ఇన్ హైదరాబాద్ థీమ్‌తో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఎగ్జిబిషన్లను వేసవి సెలవుల్లో కుటుంబ సమేతంగా సందర్శించి ఆహ్లాదాన్ని పొందాలన్నారు. ప్రస్తుతం బాపూఘాట్‌లో ఇదే కొత్త ఆలోచనలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ మమ్మల్ని ఆకట్టుకుందన్నారు. ఇందులో భాగంగా గన్‌షూట్‌తో పాటు వివిధ ఆటల్లో ఎమ్మెల్యే ఆడి అందరిని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో రాబ్సన్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



తిత్రియా దౌలత్ రామ్

గౌలిపురా: హస్టల్ నుంచి ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ సిద్ధాపూర్ గ్రామానికి చెందిన తిత్రియా చాంద్ కుమారుడు తిత్రియా దౌలత్ రామ్ (19) లాల్ దర్వాజాలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ నారాయణగూడలోని బీజేఆర్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా తిత్రియా దౌలత్ రామ్ ఒక అమ్మాయితో చనువు ఉంటూ మాట్లాడుతుండటంతో అమ్మాయి సోదరుడు హాస్టల్‌కు వచ్చి వార్నింగ్ ఇచ్చి వెళ్లాడు.

దీంతో దౌలత్ కొన్ని రోజుల పాటు ప్రస్తుతం ఉన్న హాస్టల్‌ను వదిలి ఫలక్‌నుమాలో తన బాబాయి నిర్వహిస్తున్న హాస్టల్‌కు వెళుతున్నట్లు తోటి రూమ్‌మెంట్ బి.దౌలత్ రామ్‌కు తెలిపి వెళ్లిపోయాడు. అనంతరం తిత్రియా దౌలత్ రామ్ కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

గన్‌ఫౌండ్రీ: అంగన్‌వాడీ గుడ్ల సరఫరా భవిష్యత్తులో తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్, పౌల్ట్రీ చిన్న, సన్నకారు రైతులతోనే జరగాలని తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ సభ్యులు కోరారు. అంగన్‌వాడీ పథకం కింద గుడ్ల సరఫరా కేవలం కొంత మంది మధ్యవర్తుల చేతుల్లో ఉందని తెలుసుకుని మధ్యవర్తుల చేతికి వెళ్లకుండా వాయిదా వేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు బషీర్‌బాగ్‌లోని పౌల్ట్రీ ఫెడరేషన్ కార్యాలయం వద్ద నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ, ఇండియన్ పౌల్ట్రీ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అసోసియేషన్, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ..అంగన్‌వాడీ పథకంలో గుడ్ల సరఫరా కొంతమందికే వెళ్లకుండా తీసుకున్న నిర్ణయం పౌల్ట్రీ రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్, వ్యవస్థాపకులు అనిల్ దుమాల్, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.భాస్కర్‌రావు, ఫెడరేషన్ మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి, పాట్లూరి చక్రధర్ రావు పాల్గొన్నారు.

వరంగల్ విమానాశ్రయానికి ఆచార్య జయశంకర్ పేరు పెట్టాలి



అభివాదం చేస్తున్న విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: వరంగల్ జిల్లా మామునూర్ విమానాశ్రయానికి తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్‌లోని మాతృసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి ఆచార్య జయశంకర్ అని, ఆయన పేరును విమానాశ్రయానికి పెట్టాలని బహుళ సంఘాల ప్రతినిధులు కోరుతున్నట్లు తెలిపారు. ఆయన స్వస్థలం వరంగల్ జిల్లా అని, ఆ జిల్లాలో నెలకొల్పుతున్న విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టడం సముచితమన్నారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



ఇంటర్మీడియేట్ బోర్డు కార్యాలయ ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న ఏబీవీపీ శ్రేణులు

గన్‌ఫౌండ్రీ: 10వ తరగతి ఫలితాలు రాకముందే ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ అడ్మిషన్లు తీసుకుంటున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి పృథ్వీతేజ కోరారు. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇంటర్ బోర్డు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇంటర్మీడియేట్ అడ్మిషన్లను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఒకే అనుమతి తీసుకొని అనేక బ్రాంచ్‌లను నిర్వహిస్తూ అనుమతిలేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. విచ్చల విడిగా వివిధ కోర్సుల పేరుతో ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియేట్ బోర్డు వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ శ్రేణులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కేంద్ర కమిటీ సభ్యురాలు ఝాన్సీ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీరామ్, కల్యాణి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ

అబిడ్స్: చలో వరంగల్ జాంబాగ్ డివిజన్ పోస్టర్లను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, గోషామహల్ నియోజకవర్గం నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్, ప్రియాగుప్తా, తెలంగాణ ఉద్యమ నేత ఆర్‌వి.మహేందర్ కుమార్, మాజీ కార్పొరేటర్ రాంచందర్ రాజుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 27న జరిగే వరంగల్ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అహ్మద్, జగపతి, భజన్ సింగ్, విజయ్ ముదిరాజ్, నరేష్ గౌడ్, రవి యాదవ్, అస్లం, ఫయీం పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న సజ్జాద్ అలీ

గోల్కొండ: హజ్‌యాత్రకు వెళ్తున్న వారికి ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించి వారందరికీ వ్యాక్సిన్ వేయిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యనిర్వహణ అధికారి సజ్జాద్ అలీ అన్నారు. గురువారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన హజ్‌యాత్రకు వెళ్తున్న వారి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హజ్‌యాత్రికులందరూ క్షేమంగా వెళ్లి రావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ అభిమతమన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో వ్యాక్సినేషన్ క్యాంప్ ఏర్పాటు చేయడం వరుసగా ఇది రెండవ సంవత్సరం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.నర్సింహ్మారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆబిద్, ఆసుపత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ రాకేష్‌కుమార్, వైద్య, నర్సింగ్ బృందం ఉన్నారు.